సాక్షి
నంద్యాల
సోమవారం ၊ 11 ၊ సెప్టెంబర్ ၊ 2023



శాస్త్రోక్తంగా పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు.



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి కర్నూలుకు చెందిన కేవీ రేవతి ఆదివారం రూ.1,01,116 విరాళంగా అందజేశారు.



ఔషధం..మోసం!

మార్కెట్‌లో నకిలీ, శాంపిల్ మందుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. పట్టించుకోవాల్సిన ఔషధ నియంత్రణ అధికారులు నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

బలవంతంగా బంద్ చేయిస్తే కఠిన చర్యలు



బొమ్మలసత్రం: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు రిమాండ్ నేపథ్యంలో టీడీపీ నేతలు సోమవారం బంద్‌కు పిలుపు ఇచ్చారని, అయితే ఎవరైనా బలవంతంగా దుకాణాలను బంద్ చేయిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్పీ రఘువీర్‌రెడ్డి హెచ్చరించారు. ప్రజల సాధారణ జన జీవనానికి, రాకపోకలకు అంతరాయం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. సోమవారం నుంచి పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉన్నందున జిల్లాలో ఎక్కడా నిరసనలు, ర్యాలీలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బంద్ పేరుతో కళాశాలలు, పాఠశాలలు, దుకాణాలను బలవంతంగా మూయించాలని చూస్తే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు ఎస్పీ సూచించారు.

నేడు జగనన్నకు చెబుదాం

నంద్యాల: స్థానిక కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో సోమవారం వినూత్న తరహాలో 'జగనన్నకు చెబుదాం–స్పందన' కార్యక్రమం ఉంటుందని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఉదయం 9.30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరు కావాలన్నారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

శ్రీశైలంలో టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం పరిసర ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని, ఈ మేరకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఏపీ టూరిజం డైరెక్టర్ రేగాణ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం ఆయన శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే టూరిజం శాఖ వసతి, రోప్‌వే, బోటింగ్ సౌకర్యాలను కల్పించిందన్నారు. క్షేత్ర పరిధిలో మరిన్ని ప్రాంతాలను పర్యాటక ప్రాంతాలుగా మార్చేందుకు చర్యలు చేపట్టామన్నారు.

శ్రీమఠంలో కర్ణాటక హైకోర్టు జడ్జీలు



పూజలు చేస్తున్న జడ్జీలు

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు కర్ణాటక హైకోర్టు జడ్జీలు హేమలేఖ, వెంకటేష్‌నాయక్, రాజేష్‌రాయ్ ఆదివారం మంత్రాలయం వచ్చారు. వీరు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వీరికి శ్రీ మఠం అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

చట్టం ముందు అందరూ సమానమే!

- టీడీపీ అధినేత చంద్రబాబు రిమాండ్‌తో జిల్లా వ్యాప్తంగా అన్ని వర్గాల్లో ఇదే చర్చ
- నంద్యాలలో అరెస్టయినప్పటి నుంచి రిమాండ్ వరకూ ఏం జరుగుతుందో అని ఉత్కంఠ
- టీడీపీ అధిష్టానం పిలుపు మేరకు జిల్లాలో పలు చోట్ల టీడీపీ రిలేదీక్షలు
- కోర్టు తీర్పు నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా జిల్లాలో 144 సెక్షన్
- చంద్రబాబు రిమాండ్‌తో చట్టం ముందు అందరూ సమానమే అని స్పష్టమైందంటున్న రాజకీయపార్టీలు, విశ్లేషకులు

సాక్షిప్రతినిధి కర్నూలు: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడికి విజయవాడ ఏసీబీ కోర్టు రిమాండ్ విధించడంతో చట్టం ముందు అందరూ సమానమనే అభిప్రాయం అంతటా వినిపించింది. ప్రతిపక్ష నేత రిమాండ్ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా పోలీసులు నంద్యాల, కర్నూలు జిల్లాలో 144 సెక్షన్ అమలు చేశారు. శనివారం ఉదయం నంద్యాలలో చంద్రబాబును అరెస్టు చేసిన సందర్భంలో జిల్లాలో అక్కడక్కడ టీడీపీ నిరసన కార్యక్రమాలకు దిగింది. ఈ క్రమంలో ఆదివారం కోర్టులో విచారణ, వాదనల నేపథ్యంలో తీర్పుపై రెండు జిల్లాల రాజకీయపార్టీలతో పాటు సామాన్య ప్రజల్లో కూడా ఆసక్తి నెలకొంది. కోర్టు ఎలాంటి తీర్పు ఇస్తుంది? చంద్రబాబు రిమాండ్‌తో జైలుకు వెళ్తారా? లేదంటే బెయిల్ వస్తుందా? అనే అంశంపై రాజకీయపార్టీలు, అసోసియేషన్లతో పాటు టీ బంకులు, హోటళ్లు, సెలూన్ షాపులు, బస్టాండ్లు, పల్లెల్లో రచ్చబండలపై కూర్చున్న వారితో పాటు ఎక్కడ నలుగురు గుమికూడిన అదే చర్చే నడిచింది. చంద్రబాబు నంద్యాల జిల్లా కేంద్రంలో ఉండగా అరెస్టు కావడంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ చర్చ మరింత తీవ్రంగా నడిచింది. ఉదయం నుంచి టీవీ ఛానెళ్లను ఆసక్తిగా చూశారు. తీర్పు కోసం ఉత్కంఠగా వేచి చూశారు. మాజీ ముఖ్యమంత్రి కావడం, వ్యవస్థలను ప్రభావితం చేసే వ్యక్తిగా చంద్రబాబుకు పేరుండటంతో తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. అయితే ఆదివారం సాయంత్రం చంద్రబాబుకు రిమాండ్ విధిస్తూ కోర్టు తీర్పు వెల్లడించడంతో చట్టం ముందు అందరూ సమానమనే అభిప్రాయం వ్యక్తమయ్యింది.

బాబుకు రిమాండ్‌తో టీడీపీ శ్రేణుల డీలా

చంద్రబాబుకు రిమాండ్‌పై తీర్పు వచ్చే వరకూ జిల్లా ప్రజలు స్కిల్‌స్కాం, వాదనలు వినడంతో కేసుపై వారికి కూడా స్పష్టత వచ్చింది. బాబుకు రిమాండ్ తర్వాత దీనిపై అర్ధరాత్రి వరకూ చర్చలు నడిచాయి. పక్కా ఆధారాలు ఉండటంతో చంద్రబాబు తప్పించుకోలేకపోయారని, కచ్చితంగా అవినీతి జరిగిందనేందుకు ఆధారాలు ఉన్నాయని, చంద్రబాబు అవినీతి బట్టబయలవుతోందనే అభిప్రాయానికి వచ్చారు. కోర్టు తీర్పుతో ఎంతటి వారైనా చట్టం ముందు సమానమే అని స్పష్టమైందనే చర్చించుకున్నారు. అరెస్టు నేపథ్యంలో టీడీపీ అధిష్టానం ఆదేశాల మేరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో రిలేదీక్షలను నిర్వహించారు. పోలీసులను రెచ్చగొట్టే విధంగా వ్యవహరించి, శాంతిభద్రతలకు విఘాతం కల్గించాలనే దిశగా ప్రయత్నాలు చేశారు. అయితే పోలీసులు సమయస్ఫూర్తిగా వ్యవహరించి గట్టి భద్రతా చర్యలు తీసుకున్నారు. మరోవైపు బాబుకు బెయిల్ వస్తుందని టీడీపీ వర్గాల్లో చర్చ జరిగింది. అయితే రిమాండ్ విధించడంతో ఒక్కసారిగా డీలాపడ్డారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటంతో ఈ ప్రభావంపై పార్టీపై తీవ్రంగా ఉంటుందనే అభిప్రాయానికి వచ్చారు. ఇప్పటికే పార్టీ ఉమ్మడి జిల్లాలో ఉనికి లేకుండా పోయిందని, చంద్రబాబు అవినీతి వ్యవహారంలో మరింత నష్టం జరుగుతుందని భావనకు వచ్చారు.

జిల్లాలో 144 సెక్షన్ అమలు

కోర్టు తీర్పు నేపథ్యంలో జిల్లాలో టీడీపీ నేతలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా ఆదివారం మధ్యాహ్నమే ఉమ్మడి జిల్లాలో 144 సెక్షన్ అమలు చేశారు. సాయంత్రం తీర్పు తర్వాత కూడా శాంతిభద్రతలకు విఘాతం కల్గకుండా గట్టి భద్రతా చర్యలు తీసుకున్నారు. టీడీపీ నేడు(సోమవారం) రాష్ట్రవ్యాప్తబంద్‌కు పిలుపునిచ్చింది. అయితే సోమవారం కూడా 144 సెక్షన్ అమలులో ఉండనుంది. నలుగురు కంటే ఎక్కువ ఒకే ప్రాంతంలో గుమికూడకూడదు. ధర్నాలు, ర్యాలీలు నిర్వహించరాదు. మరోవైపు కోర్టు తీర్పును వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ స్వాగతించింది. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం విచారణ సుదీర్ఘంగా సాగిందని, చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారనే పక్కా ఆధారాలను సీఐడీ అధికారులు సేకరించి అరెస్టు చేశారని, చంద్రబాబు అవినీతి వ్యవహారాలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నేతలు డిమాండ్ చేశారు.

చంద్రబాబుకు పెద్ద గుణపాఠం



ఎన్ని తప్పులు చేసినా ఎవరూ ఏమీ చేయలేరన్న ధీమాతో ఉన్న చంద్రబాబుకు స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం పెద్ద గుణపాఠం. ఖరీదైన లాయర్లను పెట్టుకొని బెయిల్ తెచ్చుకోవాలని చూసినా బాబుకు ఆశాభంగం కలిగింది. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో పథకాన్ని పెట్టి ప్రజాధనాన్ని దోచుకోవడం ఎంత వరకు సబబో ప్రజలు ఆలోచన చేయాలి. ఈ కేసులో బాబుకు శిక్ష పడడం ఖాయం.

– కాటసాని రాంభూపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే

ఎల్లకాలం అలా జరగదు



తప్పు చేసి ఎంత బుకాయించినా నిజం అనేది దాగదు. ఇన్నేళ్లు అవినీతి, అక్రమాలు చేసి చంద్రబాబు బతికారు. వ్యవస్థలను మేనేజ్ చేస్తూ చట్టాలను చుట్టాలుగా మార్చుకున్నారు. ఎల్ల కాలం అలా జరగదు. చంద్రబాబు అవినీతిని సమర్థించే పవన్‌కల్యాణ్, పురందేశ్వరి ఆలోచన చేయాలి. బాబు ఇచ్చే ఒకటో, రెండో సీట్ల కోసం కమ్యూనిస్టులు ఆయనకు మద్దతుగా నిలుస్తున్నారు. చంద్రబాబు రిమాండ్ ఎల్లో మీడియాకు చెంపపెట్టు.

– బీవై రామయ్య, కర్నూలు నగరమేయర్, వైఎస్‌ఆర్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు

వ్యవస్థలను మేనేజ్ చేసి ఇన్నాళ్లు తప్పించుకున్నారు



చంద్రబాబు నాయుడు జీవితమంతా అవినీతే. లేదంటే ఆయన రెండు ఎకరాల నుంచి రెండు లక్షల కోట్లు ఎలా సంపాదిస్తారు. వ్యవస్థలను మేనేజ్ చేసి చేసిన అవినీతిని కప్పి పుచ్చుకొని బయట పడుతూ వచ్చారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో సరైన ఆధారాలు దొరకడంతో జైలుకు వెళ్లారు. ఈ కేసులో న్యాయమే గెలిచింది.

– హఫీజ్‌ఖాన్, ఎమ్మెల్యే, కర్నూలు

అవినీతికి పాల్పడితే శిక్ష తప్పదు



చట్టానికి ఎవరూ అతీతులుకాదు. అందరూ సమానమేనని నిరూపణ అయింది. అవినీతి చేసి ఖరీదైన లాయర్లతో బయట పడాలని చూసిన బాబుకు విజయవాడ న్యాయం స్థానం సరైన తీర్పు ఇచ్చింది. అవినీతికి పాల్పడితే ఎంతటి వారికైనా శిక్ష తప్పదు.

– డాక్టర్ జే.సుధాకర్, ఎమ్మెల్యే, కోడుమూరు

చంద్రబాబు అరెస్టు సక్రమమే



చట్టానికి ఎవరూ చుట్టాలు కాదు. కొన్నిసార్లు చట్టం కళ్లు కప్పి తప్పించుకోవచ్చు. అయితే ఎప్పుడూ అలానే తప్పించుకోవాలని చూడటం మంచికాదు. చంద్రబాబు అరెస్టు సక్రమమే. ఈ కేసులో ఆధారాలు చాలా స్పష్టంగా ఉండడంతోనే రిమాండ్ విధించారు. తప్పు చేస్తే చట్టం ఎవరినీ వదలదు.

– కె.ఓంకార్, న్యాయవాది, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు

ప్రజలు క్షమించరు



చట్టం ముందు అందరూ సమానమే. తప్పు చేస్తే చట్ట ప్రకారం ఎవరినైనా దర్యాప్తు సంస్థలు అరెస్టు చేస్తాయి. యువతీ, యువకులకు ఉపాధి కల్పిస్తామన్న పేరిట స్కాం చేసిన చంద్రబాబు అండ్ కోను ఎప్పుడో అరెస్టు చేయాల్సి ఉండేది. రాష్ట్రంలో లక్షలాదిమంది నిరుద్యోగులు ఉపాధి కోసం వేటాడుతుంటే వారి పేరిటనే స్కాం చేసిన చంద్రబాబును ప్రజలు క్షమించరు.

– రాజశేఖర్, డీవీఎంసీ మాజీసభ్యుడు, కర్నూలు

ఎప్పుడూ మోసం చేయలేం



ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుంది. కొందరిని కొంత కాలమే మోసం చేయగలం. అందరినీ ఎప్పుడూ మోసం చేయలేం. మాజీ ముఖ్య మంత్రి చంద్రబాబు స్కామ్‌లు చాలా ఉన్నాయి. ఆయన ఎప్పుడో దొరకాల్సింది. అన్ని వ్యవస్థలను మ్యానేజ్ చేసుకుంటూ స్టేలు తెచ్చుకుంటూ వచ్చారు. నిప్పు అంటూ ఊదరగొట్టారు. స్కామ్‌లన్నీ బయటికి రావాల్సి ఉంది.

– రోషన్ అలీ, రిటైర్డ్ తహసీల్దార్

బడుగు, బలహీనవర్గాల అభివృద్ధే లక్ష్యం



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

- మంత్రి గుమ్మనూరు జయరాం

దేవనకొండ: బడుగు, బలహీనవర్గాల అభివృద్ధే తమ లక్ష్యమని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. ఆదివారం మండలంలోని కుంకనూరు గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ ముందుకెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..జనం మెచ్చిన నేత జగనన్న అయితే , జనాన్ని ముంచిన నేత చంద్రన్న అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ స్కాంలో కోట్లాది రూపాయలను స్వాహా చేశారన్నారు. రెండేళ్ల క్రితమే కేసు నమోదు అయ్యిందని, నేడు చంద్రబాబునాయుడిని అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టారన్నారు. చట్టం తన పని తాను చేసుకుని ముందుకెళ్తుందన్నారు. కుంకనూరులో నూతనంగా రూ.20 లక్షలతో గ్రామంలో సీసీ రోడ్డుకి ఆమోదం తెలిపామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రామకృష్ణ, వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ మల్లికార్జున, కో-కన్వీనర్ కబీర్‌దాసు, సర్పంచ్ ఈరమ్మ, ఎంపీటీసీ ఉషారాణి, మల్లికార్జునరెడ్డి, రామప్ప, పరమేష్, రంగన్న, కిషోర్, ప్రేమనాథ్‌రెడ్డి, దివాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చట్టానికి ఎవరూ అతీతులుకాదు

- వైఎస్‌ఆర్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రామసుబ్బారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: స్కిల్‌డెవలప్ మెంట్ స్కామ్‌లో రూ.371 కోట్ల ప్రభుత్వ, ప్రజల సొమ్ము దుర్వినియోగంపై ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడికి విజయవాడ ఏసీబీ కోర్టు రిమాండ్‌కు ఆదేశించిందని, చట్టానికి ఎవరు కూడా అతీతులు కారని వైఎస్‌ఆర్ సీపీ జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాత్రి స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో వైఎస్‌ఆర్‌సీపీ నియోజకవర్గ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఈడీ, ఐటీ, జీఎస్టీ శాఖలు ఇచ్చిన నివేదికల మేరకు సీఐడీ..చంద్రబాబును అరెస్ట్ చేసి అన్ని ఆధారాలు, సాక్ష్యాలతో కోర్టులో హాజరుపరిచిందన్నారు. ఇందులో సీఎం వైఎస్ జగన్‌కు, వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. కోర్టుల్లో నేరం చేయలేదని రుజువు చేసుకోవాలే తప్ప రాజకీయంగా లబ్ధిపొందాలని ప్రయత్నిస్తే ప్రజలే ఛీదరించుకొంటారన్నారు. ప్రశ్నిస్తానని చెప్పే దత్తపుత్రుడు రోడ్లపై దొర్లడం ఎందుకని, అనుమతులు తీసుకొని చంద్రబాబును కలవాలన్నారు. విలేకరుల సమావేశంలో ఎమ్మిగనూరు మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో కొనసాగుతున్న భక్తుల రద్దీ



భక్తులతో నిండిన క్యూలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రానికి రెండవ శనివారం ప్రారంభమైన భక్తుల రద్దీ ఆదివారం కూడా కొనసాగింది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, తదితర రాష్ట్రాల నుంచి భక్తులు శ్రీశైలం చేరుకున్నారు. శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను దర్శనార్థం వచ్చిన భక్తులతో క్షేత్రంలోని పురవీధులు, ఆలయ క్యూలైన్లు కిటకిటలాడాయి. పాతాళగంగ పుణ్యస్నానాలనంతరం భక్తులు మల్లన్న దర్శనార్థమై ఉచిత, ప్రత్యేక దర్శన క్యూలకు చేరుకోవడంతో అన్ని క్యూ కంపార్ట్‌మెంట్లు, క్యూలు భక్తులతో నిండిపోయాయి. క్యూలలో వేచి ఉన్న భక్తులకు ఆలయాధికారులు మంచినీరు, అల్పాహారాన్ని ఉచితంగా అందజేశారు.

చౌరస్తాలో చావుకేక

- బోయిలకుంట్ల మెట్ట వద్ద రోడ్డు ప్రమాదం
- ఆటోను ఢీకొన్న బొలేరో వాహనం
- ముగ్గురు దుర్మరణం, ఇద్దరికి గాయాలు
- వీరంతా సమీప బంధువులే



బొలేరో ఢీకొనడంతో తిరిగిపడిన ఆటో



ప్రమాదానికి కారణమైన బొలేరో వాహనం

మహానంది: నంద్యాల – గిద్దలూరు ప్రధాన రహదారిలో బోయిలకుంట్ల మెట్ట వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు దుర్మరణం చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా సమీప బంధువులు. నంద్యాల మండలం మిట్నాలకు చెందిన బంగ్రారాజు (27), అతని బంధువులు గోస్పాడు మండలం యాళ్లూరుకు చెందిన సుబ్బమ్మ(40), పరదేశి లక్ష్మి(30), మరో ఇద్దరు ఆదివారం ఉదయం సొంత పని మీద నంద్యాల మండలం బిళ్లలాపురానికి వెళ్లారు. రాత్రి పొద్దుపోయిన తర్వాత ఆటోలో తిరిగి వస్తుండగా బోయిలకుంట్ల మెట్ట వద్ద ఓర్వకల్లు నుంచి చేపల లోడుతో గిద్దలూరు వైపు వెళ్తున్న బొలేరో వాహనం వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న బంగ్రారాజు, సుబ్బమ్మ, లక్ష్మి అక్కడికక్కడే దుర్మరణం చెందారు. విషయం తెలుసుకున్న మహానంది ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బొలేరో డ్రైవర్ పరారీలో ఉన్నాడు. నిత్యం వాహనాల రద్దీ ఉండే ఈ మెట్ట వద్ద ప్రమాదాల నివారణకు అధికారులు స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతోనే రోడ్డు ప్రమాదం చోటు చేసుకున్నట్లు మృతుల కుటుంబీకులు విమర్శిస్తున్నారు. గతంలో పలు ప్రమాదాలు చోటు చేసుకున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

విడిపోయిన దంపతులను కలిపేందుకు వచ్చి..



మృతి చెందిన బంగారాజు, లక్ష్మీ, సుబ్బమ్మ

మనస్పర్థలతో దూరంగా ఉన్న భార్యాభర్తలను కలిపే ప్రయత్నంలో పెద్దలుగా వచ్చిన ఇద్దరు మహిళలతో పాటు పుట్టింటికి వచ్చిన భార్యకు నచ్చచెప్పి వెంట తీసుకెళ్లేందుకు వచ్చిన వ్యక్తి ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. నంద్యాల మండలం మిట్నాలకు చెందిన పరదేశి బంగ్రారాజుకు బిళ్లలాపురం గ్రామానికి చెందిన సువార్తమ్మతో వివాహమైంది. వారికి ఒక కుమార్తె ఉంది. కొద్ది నెలల క్రితం మనస్పర్థలతో దంపతులు విడిపోయి సువార్తమ్మ పుట్టింటికి చేరింది. ఈ క్రమంలో ఆమె కుటుంబీకులకు నచ్చజెప్పి వెంట తీసుకెళ్లేందుకు ఆదివారం బంగ్రారాజు దగ్గరి బంధువులైన యాళ్లూరుకు చెందిన సుబ్బమ్మ(40), పరదేశి లక్ష్మీ(30)తో పాటు అతని తల్లి మార్తమ్మ, మరో బాలుడు అమర్‌ను వెంట తీసుకెళ్లాడు. ఇరు కుటుంబాల పెద్దలతో మాట్లాడి సువార్తమ్మను అత్తారింటికి వెళ్లేలా ఒప్పించారు. సోమవారం ఒడిబియ్యం పోసి పంపిస్తామని చెప్పడంతో ఐదుగురు ఆటోలో తిరుగు ప్రయాణమయ్యారు. బిళ్లలాపురం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో బోయిలకుంట్ల మెట్ట వద్ద వేగంగా వచ్చిన బొలేరో వాహనం వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బంగ్రారాజు, సుబ్బమ్మ, లక్ష్మి అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మార్తమ్మ, అమర్ గాయపడ్డారు. సమాచారం అందుకున్న మృతుల బంధువులు సంఘటన స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇప్పటి నుంచి కలసి ఉంటామని పెద్దల ముందు ఒప్పుకున్న దంపతుల్లో కొద్ది నిమిషాల్లో విధి ఒకరిని శాశ్వతంగా దూరం చేసింది.

మెరుగైన వైద్య సేవలు అందించండి



మెడికల్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ వెంకటరమణ

పగిడ్యాల: అతిసారం బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి(డీఎంహెచ్‌ఓ) వెంకటరమణ వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం స్థానిక ప్రాథమిక ఆర్యోగ కేంద్రాన్ని తనిఖీ చేసి అతిసారం బాధితులకు అందుతున్న వైద్య సేవలు, కేసుల వివరాలపై ఆరా తీశారు. బీరవోలు, ఆంజనేయనగర్, పగిడ్యాల గ్రామాల్లో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌లను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. నిత్యం అందుబాటులో ఉండాలని, నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని వైద్య సిబ్బందిని హెచ్చరించారు. కేసులు తగ్గుముఖం పట్టినట్లు కనిపించినా ఆశావర్కర్లు ఇంటింటికి క్లోరిన్, పారసిటమాల్ మాత్రలు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని సూచించారు. చిన్నపిల్లలకు, బీపీ, షుగర్ రోగులకు అందించే చికిత్సలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆశాలకు కేటాయించిన ఇళ్ల పరిధిలో అతిసారం కేసులు వెలుగు చూస్తే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారికి సమాచారం ఇవ్వాలని తెలియజేశారు. కేసులు పూర్తిగా తగ్గిపోయే వరకు మెడికల్ క్యాంప్‌లు కొనసాగుతాయని స్పష్టం చేశారు. అనంతరం బీరవోలు, ఆంజనేయనగర్, కుంట వీధిలో పర్యటించారు. ప్రజలకు రక్షిత మంచినీటిని సరఫరా చేయాలని పంచాయతీ అధికారులను కోరారు. డీఎంహెచ్‌ఓ వెంట ఎంపీడీఓ వెంకటరమణ, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, వైద్యులు మోహన్, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

టమాట రైతుకు ప్రభుత్వం అండ

- పత్తికొండ, ప్యాపిలి మార్కెట్‌లో మార్కెటింగ్ శాఖ కొనుగోళ్లు
- రైతుల నుంచి కొన్న టమాట ఆదోని, కర్నూలు రైతుబజార్లకు సరఫరా

కర్నూలు(అగ్రికల్చర్): టమాట రైతుకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. మార్కెటింగ్ శాఖ అధికారులు పత్తికొండ మార్కెట్‌లో వేలంపాటలో పాల్గొనడం వల్ల ధరల్లో పురోగతి కనబడింది. ప్యాపిలిలో ధరలు తక్కువగా ఉండటం వల్ల మార్కెటింగ్ శాఖ అధికారులు వేలంపాటలో పాల్గొన్నారు. శనివారం ప్యాపిలిలో మార్కెటింగ్ శాఖ అధికారులు 9 టన్నుల టమాట కొనుగోలు చేశారు. అతి తక్కువగా కిలో ధర రూ.2 లభించింది. మార్కెటింగ్ శాఖ అధికారులు కిలో రూ.5.50 ప్రకారం 360 బాక్స్‌లు (బాక్స్ 25 కిలోలు) అంటే తొమ్మిది టన్నులు కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన 9 టన్నుల్లో ఆదోని రైతుబజారుకు 2 టన్నులు, కర్నూలులోని రైతుబజార్లకు 7 టన్నుల ప్రకారం సరఫరా చేశారు. మార్కెటింగ్ శాఖ అధికారులు వేలంపాటలో పాల్గొనడంతో పత్తికొండ మార్కెట్‌లో ధరల్లో పురోగతి కనిపించింది. కనిష్ట ధర కిలో రూ.8, గరిష్ట ధర రూ.16, మోడల్ ధర రూ.12 లభించింది. ఆదివారం కనిష్ట ధర రూ.7, గరిష్ట ధర రూ.15, మోడల్ ధర రూ.9 లభించింది. టమాట ధరలు తగ్గడంతో రైతులు నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం పత్తికొండ మార్కెట్‌కు ఒక టీమ్, ప్యాపిలి మార్కెట్‌కు మరొక టీమ్ ఏర్పాటు చేసింది. ఈ టీమ్‌లు వేలంపాటను పరిశీలిస్తుంటాయి. కనిష్ట ధర పూర్తిగా తగ్గినపుడు మార్కెటింగ్ శాఖ అధికారులు వేలంపాటలో పాల్గొని కొనుగోలు చేస్తారు. కొనుగోలు చేసిన టమాటకు సంబంధించి వెంటనే మార్కెటింగ్ శాఖ అధికారులు రైతులకు నగదు చెల్లిస్తారు. కర్నూలు జిల్లాలోని పత్తికొండ, ఆస్పరి, దేవనకొండ, తుగ్గలి, మద్దికెర, పెద్దకడబూరు, హొళగొంద, హాలహర్వి, వెల్దుర్తి, కృష్ణగిరి, ఓర్వకల్, కల్లూరు తదితర మండలాల్లో టమాట సాగు ఎక్కువగా ఉంది. నంద్యాల జిల్లాలోని ప్యాపిలి, డోన్, బేతంచెర్ల మండలాల్లో టమాట సాగు ఎక్కువగా ఉంది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 5,200 ఎకరాల్లో టమాట సాగైంది. ఒకేసారి టమాట మార్కెట్‌లోకి వెల్లువెత్తడంతో ధరలు తగ్గిపోయాయి.

అపుడు వినియోగదారులకు... ఇపుడు రైతులకు భరోసా...

టమాట ధరలు ఆకాశాన్నంటినపుడు ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసి సబ్సిడీపై కిలో రూ.50 ప్రకారం వినియోగదారులకు పంపిణీ చేసింది. కిలోకు రూ.60 నుంచి రూ.110 వరకు సబ్సిడీ భరించిన ప్రభుత్వం వినియోగదారులకు ఊరట కల్పించింది. ఇపుడు రైతులు పండించిన టమాట ధరలు తగ్గడంతో కొనుగోళ్లలో మార్కెటింగ్ శాఖ ప్రవేశించి గిట్టుబాటు ధరతో కొనుగోలు చేస్తోంది.

క్లుప్తంగా

ఫుట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాజశేఖర్



కర్నూలు (టౌన్): ఫుట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ముప్పా రాజశేఖర్ ఎన్నిక య్యారు. ఆదివారం స్థానిక బుధవారపేటలోని ఒక హోటల్‌లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ సంఘం ప్రతినిధి రెడ్డప్ప, న్యాయవాది కాశీ విశ్వనాథ్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. జిల్లా ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శిగా శ్రీనివాసులు, కోశాధికారిగా మల్లికార్జునుడు, కార్యవర్గ సభ్యులుగా మహేష్, జగదీష్, బ్రహ్మకుమార్, శర్మలను ఎన్నుకున్నారు. నూతనంగా జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన ముప్పా రాజశేఖర్ మాట్లాడుతూ జిల్లాలో ఫుట్‌బాల్ క్రీడాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

ఇళ్ల మధ్యలోకి కొండ చిలువ



కొండ చిలువను పట్టుకున్న స్నేక్ రాజు

శ్రీశైలం: క్షేత్రపరిధిలోని కొత్తపేటలో ఇళ్ల మధ్యలోకి ఆదివారం ఉదయం 11 అడుగుల భారీ కొండచిలువ రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. స్థానికంగా నివాసముంటున్న యాకోబు అనే వ్యక్తి ఇంటి సమీపంలోకి కొండ చిలువ కనిపించడంతో స్థానికంగా పాములు పట్టే స్నేక్ రాజుకు సమాచారం ఇచ్చారు. అతను దాదాపు గంట పాటు శ్రమించి చాకచక్యంగా పట్టుకుని దట్టమైన అటవీ మార్గంలో వదిలేశాడు.

176 బ్యాగుల రేషన్ బియ్యం స్వాధీనం

మహానంది: పేదలకు పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా ఆదివారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. వెంగళరెడ్డిపేట, మోత్కులపల్లికి చెందిన షాలిషా, చిన్నహుసేని, ఖాసీంలో ఐచర్ వాహనంలో బియ్యం తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న విజిలెన్స్ ఎస్ఐ హనుమంతు, తహసీల్దార్ వెంకటనారాయణ, ఆర్ఐ శ్రీనివాస రెడ్డి సూర్యనంది ముఖద్వారం వద్ద దాడి చేసి పట్టుకున్నారు. లారీలో 176 బ్యాగుల బియ్యం ఉన్నట్లు గుర్తించి మహానంది పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. బియ్యం అక్రమరవాణాపై సమాచారం అందించాలని ప్రజలకు ఈ సందర్భంగా అధికారులు విజ్ఞప్తి చేశారు.

కుమారుడిపై కత్తితో దాడి



గాయపడిన వీరేంద్ర

పత్తికొండ రూరల్: పొలం తగాదా ఘటనలో ఆదివారం కుమారుడిపై తండ్రి కత్తితో దాడి చేశాడు. ఈ ఘటన మండల పరిధిలోని హోసూరు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. తలకలకొండ ఉచ్చూరప్పకు ఐదుగురు కుమారులు సంతానం. నాలుగో కుమారుడు వీరేంద్ర తన భాగానికి వచ్చిన పొలాన్ని దున్నుతున్నాడు. చిన్న కుమారుడు రాజశేఖర్‌తో కలిసి తండ్రి పొలంలోకి వెళ్లి అడ్డుకోబోవడంతో వీరి మధ్యన వివాదం తలెత్తింది. దీంతో తండ్రి ఉచ్చూరప్ప.. కుమారుడు వీరేంద్రపై కత్తితో దాడి చేశాడు. వీరేంద్ర ఛాతీపై భాగంలో రక్తగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తీసుకెళ్లారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మురళీమోహన్ తెలిపారు.

ఔషధం..మోసం!

జిల్లాలో యథేచ్ఛగా అక్రమ ఔషధ వ్యాపారం

- తాజాగా రూ.10 లక్షలు విలువ చేసే శాంపిల్ మందుల పట్టివేత
- గతంలో కేసు నమోదైనా శిక్ష పడని వైనం
- ఇదే విధంగా అనేక మందిపై తెగని కేసులు
- దీంతో యథేచ్ఛగా అక్రమ వ్యాపారాలు
- నామ మాత్రపు తనిఖీలతో సరిపెడుతున్న ఔషధ నియంత్రణ అధికారులు

మనం వేసుకునే మందులు మంచివేనా...?, వాటిలో ఔషధ గుణాలున్నాయా...? అంటే ఏమో ఆ భగవంతుడికే ఎరుక అనాలి. ఎందుకంటే మార్కెట్‌లో నకిలీ, శాంపిల్ మందుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. పట్టించుకోవాల్సిన ఔషధ నియంత్రణ అధికారులు నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారు. ఎక్కడైనా ఎవ్వరినైనా పట్టుకుని కేసు పెడితే అది తెగేందుకు సంవత్సరాల తరబడి పడుతోంది. దీంతో అక్రమ వ్యాపారాలు చేసే వారు తమ దందాను యథేచ్ఛగా కొనసాగిస్తూనే ఉన్నారు.



ఇటీవల అధికారులు స్వాధీనం చేసుకున్న శాంపిల్ మందులు

కర్నూలు(హాస్పిటల్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2,700 రిటైల్ మెడికల్ షాపులు ఉన్నాయి. అందులో కర్నూలులో 1600, నంద్యాల జిల్లాలో 1100 దుకాణాలు ఏర్పాటు చేశారు. జిల్లాల విభజన తర్వాత ఆయా జిల్లాలో ఔషధ నియంత్రణాధికారులు దుకాణాల లైసెన్స్‌లు, రెన్యువల్స్ జారీ చేస్తుంటారు. ఆయా జిల్లాల్లోని దుకాణాలకు సంబంధించి తనిఖీలు, దాడులు, కేసులు కూడా ఆయా జిల్లాల పరిధిలోనే జరుగుతున్నాయి. ప్రస్తుతం కర్నూలులో ఇద్దరు, నంద్యాలలో ఇద్దరు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు విధులు నిర్వహిస్తున్నారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్లపై ఏడీ, డీడీ స్థాయి అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. ఏడీ, డీడీ కార్యాలయాలు కర్నూలులో ఉన్నాయి. ఆయా జిల్లాల్లో ఎక్కడైనా తనిఖీలు చేపడితే సంబంధిత వివరాలు కర్నూలు కార్యాలయానికి అందుతుంది. కాగా గత రెండేళ్లకు ముందు ఉన్నంత తనిఖీలు ప్రస్తుతం లేవన్న విమర్శలు వినిపిస్తున్నాయి. డీజీ కార్యాలయం నుంచి సమాచారం వస్తేనే సంబంధిత వ్యాపారులపై అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. నామమాత్రపు తనిఖీలతో అధికారులు మమ అనిపిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. కొందరు అధికారులు తనిఖీలకు వెళ్లి కేసులు నమోదు చేయకుండా మామూళ్లు దండుకుని వస్తున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు.

యథేచ్ఛగా శాంపిల్ మందుల అమ్మకాలు

కర్నూలు నగరంలో శాంపిల్ మందుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. గతంలో ఇలాంటి వ్యాపారులపై తరచూ దాడులు చేసి పట్టుకునేవారు. ఇటీవల కాలంలో శాంపిల్ మందుల వ్యాపారులను అడ్డుకోవడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి. దీంతో రెండు రోజుల క్రితం గణేష్‌నగర్‌లోని ఓ ఇంట్లో రూ.10 లక్షల విలువ జేసే శాంపిల్ మందులు అధికారుల తనిఖీల్లో లభ్యమయ్యాయి. ఈ వ్యక్తి 2017లోనూ ఇదే విధంగా శాంపిల్ మందులతో పట్టుబడ్డాడు. అప్పటి కేసు ఇప్పటికీ తెగలేదు. కాగా కొత్తబస్టాండ్ సమీపంలో ఓ వ్యక్తి నుంచి రెండేళ్ల క్రితం శాంపిల్ మందులు స్వాధీనం చేసుకున్నారు. కానీ సదరు వ్యక్తి మళ్లీ తన వ్యాపారాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తున్నా పట్టించుకోవడం లేదు. మెడికల్ కాలేజీకి ఎదురుగా ఉన్న ఓ సందులో, కృష్ణానగర్‌లోని ఐటీసీకి ఎందురుగా ఉన్న సందులో, పాతబస్టాండ్, వన్‌టౌన్ ప్రాంతాల్లో శాంపిల్ విక్రయాలు జోరుగా జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సదరు వ్యక్తులు వాటిని హైదరాబాద్, మద్రాస్, ముంబయి ప్రాంతాల నుంచి తెచ్చి రాయలసీమ జిల్లాలతో పాటు తెలంగాణాలోని పలు జిల్లాలలోని ఆర్‌ఎంపీలకు విక్రయిస్తున్నారు.

శాంపిల్స్‌లోనూ నకిలీలే !

సాధారణంగా వైద్యులు రోగులకు ఇచ్చే శాంపిల్ మందులను ఆయా కంపెనీలు ప్రమోషన్‌లో భాగంగా ఇస్తుంటాయి. ఇందులో ఔషధ గుణాలు(మాలిక్యూల్) పూర్తిస్థాయిలో ఉంటాయి కాబట్టి వాటిని వాడిన రోగులకు వ్యాధిలో గుణం కనిపిస్తుంది. కానీ అక్రమ శాంపిల్ మందుల వ్యాపారంలో మరో కోణం ఉన్నట్లు తెలుస్తోంది. శాంపిల్ మందులపై ప్రజలకున్న నమ్మకాన్ని ఆసరాగా చేసుకున్న వ్యాపారులు అడ్డదారులు తొక్కుతున్నారు. కొన్ని మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీలతో కుమ్మక్కై శాంపిల్ మందులు కూడా నకిలీలు తయారు చేస్తున్నారు. ఇలా శాంపిల్ మందుల ముసుగులో నాణ్యత లేని నకిలీ మందులను తయారు చేసి రోగులకు అంటగడుతున్నారనే విమర్శలున్నాయి.

విరివిగా మత్తు మందుల విక్రయం

జిల్లాలో పలు మెడికల్‌షాపుల్లో మత్తు మందుల విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ముఖ్యంగా నగరంలోని నంద్యాల రోడ్డులో దేవి ఫంక్షన్ హాలుకు సమీపంలో ఉన్న దుకాణంలో దగ్గు మందు సిరప్‌లు విచ్చలవిడిగా విక్రయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలాగే వడ్డేగేరి, గాంధీనగర్‌లోని పలు దుకాణాల్లో ఈ దందా సాగుతోంది. పలువురు లారీ, ట్రక్కు, ఆటో డ్రైవర్లు, విద్యార్థులు, చెడు అలవాట్లకు బానిసైన యువత లక్ష్యంగా వీటి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. దీనిపై ఔషధ నియంత్రణ శాఖ ఏడీ రమాదేవి మాట్లాడుతూ మెడికల్‌షాపులపై తరచూ తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నామని, ఇకపై కూడా మరింత ఉధృతంగా దాడులు, తనిఖీలు నిర్వహించి అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామన్నారు.

విచ్చలవిడిగా నకిలీ మందుల విక్రయాలు

మార్కెట్‌లో పేరు మోసిన, బాగా ప్రచారం పొందిన బ్రాండెడ్ మందుల విక్రయాలను ఆసరాగా చేసుకుని వ్యాపారులు వాటిని పోలిన నకిలీ మందులు తయారు చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఇలాంటి వాటిలో అత్యధికంగా విటమిన్ మందులదే అగ్రభాగం. బ్రాండెడ్ మందులకు ఒకటి, రెండు అక్షరాలు అటు ఇటుగా మార్చి ప్యాకింగ్ ఒకేలా తయారు చేసి దుకాణాల్లో విక్రయిస్తున్నారు. నిరక్షరాస్యులు, మందులపై అవగాహన లేని వారు వీటిని బ్రాండెడ్ మందులుగా భావించి అధిక ధరలకు కొని వాడుతున్నారు.

ఇటీవల విధించిన జరిమానాలు, శిక్షలు

- ఆలూరులో లైసెన్స్ లేకుండా మందులు విక్రయిస్తున్నారని తెలియడంతో దాడులు నిర్వహించి రూ.25వేల విలువ గల 37రకాల మందులను సీజ్ చేశారు.
- కర్నూలులోని గాయత్రి ఎస్టేట్‌లోని డాట్స్ మెడికల్ అండ్ సర్జికల్ ఏజెన్సీలో పిరమిడ్ ఫార్మాకు చెందిన సెపోమిడ్-సివి అనే మందు నాణ్యత లేదని తేలింది.
- నగరంలోని కుమ్మరి వీధిలో 2019 సంవత్సరంలో సుమాబాయి అనే వ్యక్తి రూ.3 లక్షల విలువ చేసే ఫిజీషియన్ శాంపిల్స్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయగా ఇటీవల వారికి రూ.1.20 లక్షల జరిమానా, ఒక రోజు కోర్టులో నిలబడేలా శిక్ష విధించారు.
- 2016లో కర్నూలు నగరంలోని చిన్నపార్కు సమీపంలో ఇమ్మానియేల్ అనే వ్యక్తికి చెందిన స్వాతి ఏజెన్సీస్ వారు న్యాకో కంపెనీ సరఫరా చేసిన ప్రభుత్వ హెచ్ఐవీ మందులను కలిగి ఉండటంతో కేసు నమోదు చేశారు. వీరికి ఇటీవల రూ.80 వేలు జరిమానా, ఒక రోజు కోర్టులో నిలబడే విధంగా శిక్ష విధించారు.
- కర్నూలు నగరంలోని వన్‌టౌన్ ప్రాంతంలోని నీలకంఠేశ్వరప్ప అనే వ్యక్తి ఫిజీషియన్ శాంపిల్స్ కలిగి ఉండటంతో గతంలో కేసు నమోదు చేశారు. అతనికి ఇటీవల రూ.45 వేలు జరిమానా విధించారు.

మహానందిలో భక్తుల సందడి



వేకువజామున హారతుల దర్శనంలో భక్తులు

మహానంది: మహానంది ఆలయంలో ఆదివారం భక్తజన సందడి కనిపించింది. సెలవురోజు కావడంతో వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వివిధ రాష్ట్రాల భక్తుల రాకతో ఆలయ ప్రాంణాలు కళకళలాడాయి. ఆలయానికి వచ్చిన భక్తులు శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామివారిని దర్శించుకుని భ భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్వామి,అమ్మవారి దర్శనం అనంతరం ఆలయ ప్రాంగణంలోని కోదండరామాలయం, వినాయక నందీశ్వర, గరుడనందీశ్వర స్వామి ఆలయాలను సందర్శించారు. వివిధ ఆర్జిత సేవా విభాగాలైన దర్శనం టికెట్లు, అభిషేకం, ప్రసాదాలు, తదితర వాటి ద్వారా ఆలయానికి రూ.లక్షల్లో ఆదాయం సమకూరింది.

108లో ప్రసవం



ఆడబిడ్డకు జన్మనిచ్చిన బయమ్మ

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలానికి 14 కిమీ దూరంలోని ప్రకాశం జిల్లా చిన్నారుట్ల గిరిజన గూడానికి చెందిన మహిళ ఆదివారం తెల్లవారుజామున 108లో ప్రసవించింది. పులిచర్ల బయమ్మ నిండుగర్భిణి. పురిటినొప్పులు రావడంతో 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెనువెంటనే వారు గ్రామానికి చేరుకుని సున్నిపెంట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ ఇద్దరు క్షేమంగా ఉన్నట్లు 108 సిబ్బంది తెలిపారు.

శ్రీశైలం డ్యాం నీటిమట్టం 854.70 అడుగులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం డ్యామ్ నీటిమట్టం ఆదివారం సాయంత్రం సమయానికి 854.70 అడుగులకు చేరుకుంది.ఎగువ పరివాహక ప్రాంతమైన జూరాల నుంచి 5,385 క్యూసెక్కుల వరద ప్రవాహం శ్రీశైలానికి వచ్చి చేరుతుంది. శనివారం నుంచి ఆదివారం వరకు జలాశయం నుంచి 4,035 క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేశారు. బ్యాక్‌వాటర్‌నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా 1,583 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజలస్రవంతికి 1,455 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. జలాశయంలో ప్రస్తుతం 91.1944 టీఎంసీల నీరు నిల్వగా ఉంది.

కోలుకోలేక భర్త మృతి.. భార్యకు అస్వస్థత



మృతి చెందిన రంగస్వామి



స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న రమణమ్మ

పగిడ్యాల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పగిడ్యాలలో అతిసారం బారినపడిన ఓ వ్యక్తి కోలుకోలేక మృతి చెందిన ఘటన ఆదివారం కుంటవీధిలో చోటుచేసుకుంది. కాలనీకి చెందిన గొల్ల రంగస్వామి(62) అతని భార్య రమణమ్మలు శనివారం వాంతులు, విరేచనాలకు గురికాగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందారు. వ్యాధి తీవ్రతను తగ్గించేందుకు స్థానిక వైద్యులు మోహన్ రంగస్వామికి ఫ్లూయిడ్స్(సెలైన్) పెట్టి బీపీ లెవెల్స్‌ను గమనిస్తూ వచ్చారు. అయితే సెలైన్స్ పెట్టిన బీపీ లెవెల్స్ పెరగకపోవడంతో మెరుగైన వైద్యం కోసం నందికొట్కూరు సీహెచ్‌సీకి రెఫర్ చేశారు. అయితే అక్కడి వైద్యులు సరిగా పట్టించుకోకుండా ఇంటికి పంపివేశారని కుటుంబీకులు ఆరోపించారు. పగిడ్యాల ఆరోగ్య కేంద్రంలోనే వైద్యులు బాగా చూశారని, నందికొట్కూరు వైద్యులు పట్టించుకోకపోవడంతోనే అనర్థం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. తన తండ్రి మృతి చెందడానికి నందికొట్కూరు వైద్యుల నిర్లక్ష్యమేనని మృతుని కుమారుడు రాజు కన్నీటి పర్యంతమయ్యాడు. తండ్రి హఠాన్మరణాన్ని జీర్ణించుకోక ముందే తల్లి రమణమ్మ కూడా వాంతులు, విరేచనాలు తీవ్రం కావడంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేరిందని వాపోయాడు. మృతునికి భార్య, రమణమ్మ, కుమారులు రాజు, రామకృష్ణ, కూతురు శారద ఉన్నారు.

వైభవంగా లక్ష్మీవెంకటేశ్వర ఆలయ సింహ ద్వారం ప్రారంభోత్సవం



ఆలయ సింహ ద్వారాన్ని ప్రారంభిస్తున్న హీరో సుమన్, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ విజయమనోహరి

కోడుమూరు రూరల్: పట్టణంలో శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా చేపట్టిన సింహ ద్వారం ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ చైర్మన్ ఎద్దుల మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సింహ ద్వార ప్రారంభోత్సవానికి సినీ హీరో సుమన్, మాజీ కేంద్ర రైల్వే సహాయ మంత్రి కోట్ల జయ సూర్యప్రకాష్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ విజయ మనోహరి, మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీ మోహన్‌రెడ్డి, పరిగెల మురళీకృష్ణ, కోట్ల హరిచక్రపాణిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిమూలపు సతీష్, స్టేట్ కమిటీ సభ్యులు సంధ్య విక్రమ్‌కుమార్, కేవీ సుబ్బారెడ్డి కళాశాల అధినేత కేవీ సుబ్బారెడ్డి, కోట్ల కవితమ్మ, శ్యామరావు పాటు పలువురు రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు.

చరిత్రలో నిలిచేలా ఆలయ నిర్మాణం

సినీనటుడు సుమన్ మాట్లాడుతూ దేవతల సహిత శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణంలో సిమెంట్, ఇసుక వంటివి ఉపయోగించకుండా పూర్తిగా పురాతన పద్ధతిలో రాతి దూలాలు, శిలలు, శిల్పాలతో నిర్మిస్తుండటంతో చరిత్రలో నిలిచిపోతుందన్నారు. తాను అన్నమయ్య సినిమాలో శ్రీవెంకటేశ్వరస్వామి పాత్ర పోషించేందుకు ఎంతో కష్టపడ్డానని, ఆ సినిమాను స్వయంగా అప్పటి రాష్ట్రపతి శంకర్ దయాళ్‌శర్మతో కలిసి చూడడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కేడీసీసీ బ్యాంకు చైర్మన్ విజయమనోహరి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణంతో జిల్లాలో కోడుమూరు పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం



మాధవి (ఫైల్)

బనగానపల్లెరూరల్: నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని దేవనగర్ గ్రామానికి చెందిన చిన్నబాబు కుమార్తె మాధవి (14) రెండు రోజులుగా కనిపించడం లేదు. ఈ నెల 8వ తేదీన రాత్రి నుంచి కనిపించక పోవడంతో కుటుంబీకులు సమీప గ్రామాల బంధువులు, స్నేహితులను ఆరా తీసిన ఆచూకీ లభించలేదు. దీంతో బాలిక తల్లి చిన్నలక్ష్మీదేవి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు.

రచయిత అజీజ్‌కు నాగయ్య పురస్కారం



కర్నూలు కల్చరల్: ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు ఎం.చిన నాగయ్య స్మారక జాతీయ పురస్కారానికి జిల్లా రచయిత ఎస్‌డీవీ అజీజ్ ఎంపికయ్యారు. జీవిత చరిత్రల విభాగంలో అజీజ్‌కు పురస్కారాన్ని ప్రకటించినట్లు చిన నాగయ్య మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధి ఎం.రాంప్రదీప్ తెలిపారు. కాగా అవార్డుకు ఎంపికైన అజీజ్‌కు పలువురు సాహితీ వేత్తలు శుభాకాంక్షలు తెలిపారు.

సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ



ఐలమ్మ చిత్రపటం ముందు నివాళి అర్పిస్తున్న నేతలు

కర్నూలు(అర్బన్): తెలంగాణ సాయుధ పోరులో నిజాం బలగాలకు వెన్నుచూపకుండా పోరాడిన వీర వనిత చాకలి ఐలమ్మ అని పలు ప్రజా సంఘాల నేతలు కొనియాడారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక బీసీ భవన్‌లో ఐలమ్మ చిత్రపటానికి వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. రజక ఐక్య సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు వేంపెంట రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రజక విద్యా సేవా సమితి అధ్యక్షుడు సీపీ వెంకటేష్, రజక సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాడాల నాగరాజు, బీసీ విద్యార్థి సంఘం జాతీయ కార్యదర్శి కె. రామక్రిష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాయుధ ఉద్యమంలో పీడిత ప్రజలను కూడగట్టిన ధైర్యశాలి ఐలమ్మ అని కొనియాడారు. ప్రతి పట్టణంలో ఆమె విగ్రహాలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్నారు. భావి తరాలకు ఐలమ్మ పోరాట పటిమ, త్యాగ నిరతిని తెలియజెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.కార్యక్రమంలో రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఆలూరు జయరాం, భారతి, మాలంగిరి గణేష్, కేతూరు మధు, గంగాధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలు

- ఓవరాల్ చాంపియన్‌గా విశాఖపట్నం
- రెండవ స్థానంలో కర్నూలు, మూడవ స్థానంలో కృష్ణ జిల్లా జట్లు



రన్నరప్‌గా నిలిచిన కర్నూలు జిల్లా జట్టు

కర్నూలు (టౌన్): యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, యోగ అసోసియేషన్ ఆఫ్ కర్నూలు జిల్లా సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఇండోర్ స్టేడియంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న 48 వ రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలు ఆదివారం సాయంత్రం ముగిసాయి. ఈ పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా విశాఖపట్నం జట్టు, రెండో స్థానంలో కర్నూలు జట్టు, మూడవ స్థానంలో క్రిష్ణ జిల్లా జట్లు నిలిచాయి. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు.. రాష్ట్ర యోగా సంఘం చైర్మన్ లక్ష్మీకాంతరెడ్డి, ప్రధాన కార్యదర్శి అవినాష్‌శెట్టి మాట్లాడుతూ సబ్ జూనియర్స్, జూనియర్ బాల బాలికలు నవంబర్ 23 నుంచి 26 వరకు అస్సాం రాష్ట్రంలోని గౌహతిలో జరిగే జాతీయ స్థాయి యోగాసన పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున పాల్గొంటారని వెల్లడించారు. కార్యక్రమంలో 41 వ వార్డు కార్పొరేటర్ శ్వేతారెడ్డి, స్పోర్ట్స్ మాజీ డైరెక్టర్ రవీంద్రనాథ్, వెంకటేశ్వర్లు, రైస్ మిల్లు యజమాని భాస్కర్ రెడ్డి, రాష్ట్ర యోగ సంఘం సభ్యులు మురళీక్రిష్ణ, వెంకట్, చంద్రశేఖర్, డాక్టర్ రామారావు పాల్గొన్నారు.

ఎత్తయిన బోదెలు ఎంతో మేలు

- డ్రిప్‌తో ఉల్లి సాగు చేస్తే మరిన్ని ఉపయోగాలు
- పెరగనున్న మొక్కల సంఖ్య
- మంచి దిగుబడులు వచ్చే అవకాశం
- ఉద్యానశాఖ సహాయ సంచాలకుల సూచనలు



ఎత్తయిన బోదెలపై సాగు చేసిన ఉల్లి

కర్నూలు(అగ్రికల్చర్): ప్రస్తుతం రైతులు రబీ సీజన్‌కు సిద్ధం అవుతున్నారు. ఉల్లి సాగుకు ఉత్సాహం చూపుతున్నారు. ఎత్తయిన బోదెలపై బిందు సేద్యంతో ఉల్లి సాగు చేస్తే నాణ్యమైన అధిక దిగుబడులు వస్తాయి. జిల్లాలో డోన్, ప్యాపిలి, కృష్ణగిరి, గోనెగండ్ల తదితర మండలాల్లోని రైతులు ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. బోదెలపై నీరు నిల్వ ఉండకపోవడంతో నీరు కుళ్లు, గడ్డ కుళ్లు వంటి తెగుళ్ల తీవ్రత గణనీయంగా తగ్గుతోంది. బోర్లు, బావులు ఉన్న రైతులు డ్రిప్ కోసం మీసేవా కేంద్రాల ద్వారా తగిన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం, చిన్నసన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీపై డ్రిప్ సదుపాయాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. ఎత్తయిన బోదెలపై ఉల్లిసాగులో మెలకువలు ఉద్యాన శాఖ సహాయ సంచాలకులు పి.రామాంజనేయులు మాటల్లో..

- బోదెలు తయారు చేసుకోవడంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. నల్ల రేగడి నేలలో చదునుగా వేసుకోవాలి. ఎర్ర నేలలు, తువ్వ నేలల్లో బోదెలను అర్ధచంద్రాకారంలో అంటే రోడ్లపై స్పీడ్ బ్రేకర్ల తరహాలో వేసుకోవాలి. బోదెలు భూమి లెవెల్ నుంచి 3 ఇంచుల, 5 ఇంచుల ఎత్తు వరకు వేసుకోవచ్చు. వెడల్పు 90 నుంచి 100 సెంటీ మీటర్లు ఉండాలి. మధ్య దూరం 20 నుంచి 30 సెంటీమీటర్లు ఉండే విధంగా చూసుకోవాలి. ఇలా చేసుకుంటే ఎక్కువైన నీరు అందులోకి చేరుతుంది. నడవడానికి, అంతర్ కృషికి వీలుగా ఉంటుంది.
- బిందుసేద్యంలో లాటరల్ పైపుల మధ్య దూరం 120 సెం.మీ ఉండాలి. ఎకరాకు 3,300 దీపర్ల లాటరల్ పైపులు అవసరమవుతాయి. లాటరల్ పైపుల వ్యత్యాసం 16 మీ.మీ ఉండాలి. డ్రిప్ నీటి విడుదల ప్రవాహం గంటకు నాలుగు లీటర్లు ఉండాలి.
- బోదెలపై డ్రిప్ ద్వారా ఉల్లి సాగులో మొక్కల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. దీంతో దిగుబడి పెరిగే అవకాశం ఉంటుంది. మామూలు పద్ధతిలో ఎకరాకు 1.80 లక్షల మొక్కలు వస్తాయి. బోదెల పద్ధతిలో 2.25 లక్షల మొక్కలు వస్తాయి. పాతపద్ధతిలో ఎకరాకు 8-10 టన్నుల వరకు, బోదెలపై 14 నుంచి 16 టన్నుల వరకు దిగుబడి వస్తుంది.

ఉపయోగాలు ఇవీ..

- ఎత్తయిన బోదెలపై బిందు సేద్యంలో ఉల్లి సాగు చేస్తే ఎక్కువ సంఖ్యలో మొక్కలు వస్తాయి.
- బోదెలపై నీరు నిలిచే అవకాశం ఉండదు. ఫలితంగా చీడ పీడలు సమస్యలు తక్కువగా ఉంటాయి.
- భూమిలో గడ్డలకు గాలి బాగా ప్రసరించడం వల్ల నీరు, ఎరువులు అవసరమైన మోతాదులో అందించడం వల్ల నాణ్యమైన పెద్దగడ్డలు వస్తాయి.
- వర్షాకాలంలోనూ అధిక దిగుబడులు పొందవచ్చు.
- ఈ విధానంలో వచ్చి దిగుబడి ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది.